RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, అక్టోబరు 9, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 158 | పేజీలు: 8 | వెల : రూ.1

## డిసెంబరులో హైదరాబాద్‌లో రక్షా ఎక్స్‌పో

**9న ఎయిర్‌షో.. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహణ**

హైదరాబాద్: తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026లో భాగంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్ 9న ఎయిర్‌షో కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సచివాలయంలో ఎక్స్‌పో ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో పాల్గొనే సంస్థలు, ప్రచారం, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ చర్చించారు.

## రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలి

### జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే కేంద్రానికి భట్టి విక్రమార్క విజ్ఞప్తి




**హైదరాబాద్ (వాయిస్‌టుడే):** జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించాలని, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేసేవారిపై కఠిన చర్యలు కొనసాగించాలని సూచించారు. జీఎస్టీ అమలుకు పరస్పర విశ్వాసమే పునాదని, రాష్ట్రాలు తమ పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్న నేపథ్యంలో వాటి ఆదాయాన్ని కాపాడటం కేంద్రం బాధ్యత అని అన్నారు. తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని భట్టి తెలిపారు. ఈ ఆదాయం పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు కీలకమని పేర్కొన్నారు. జీఎస్టీ మార్పుల వల్ల రాష్ట్రాల ఆదాయంపై పడే ప్రభావాన్ని ముందుగానే వివరించాలని కోరారు. మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలపై పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు తెలియజేయాలని సూచించారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్ర అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర అంచనాల ప్రకారం నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భట్టి తెలిపారు.




# ఓట్ చోరీ.. గద్దీ ఛోడో

### సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ (వాయిస్‌టుడే):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన శాంతియుత నిరసనలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల అరెస్టు అప్రజాస్వామికమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమాక్రసీ' పిలుపులో భాగంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో లోక్‌భవన్' నిరసనలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చేస్తూ నిజమైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఓటర్ల తొలగింపుతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందని, ఇది ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగుతుందని పొంగులేటి స్పష్టం చేశారు.



## అసెంబ్లీని అబద్ధాల వేదికగా మార్చారు

**కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు**

**సింగరేణి కార్మికులకు ఇంటి హక్కులు కల్పించాలని డిమాండ్**

**హైదరాబాద్ (వాయిస్‌టుడే):** కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీని అబద్ధాల వేదికగా మార్చారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. సింగరేణి కార్మికులకు ఇంటి హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి సీఎం కేసీఆర్ 2019లో జీఓ 76 జారీ చేస్తే, తామే ఆ నిర్ణయం తీసుకున్నట్లు అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ నేతలు చెప్పడం సరికాదన్నారు. జీఓ 76ను అమలు చేయకుండా సింగరేణి ప్రాంతంలోని సుమారు 30 వేల మంది ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. జీఓ 76 పరిధిలో మిగిలిన కార్మికులకు వెంటనే సేల్‌డీడ్ ద్వారా ఇంటి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. సింగరేణి బ్యాంకు ఖాతాల్లో రూ.6,323 కోట్ల లాభాలు ఉంటే రూ.4 వేల కోట్ల అప్పు ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. బ్యాంకుల్లో నిధులు ఉన్నప్పటికీ రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో కార్మికులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాలు ఎందుకు తగ్గుతున్నాయో, ఇందుకు బాధ్యులు ఎవరనేది స్పష్టం చేయాలని హరీశ్‌రావు కోరారు.



## వైసీపీకి ఈసారి 11 సీట్లు కూడా రావు

**ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా కూటమిదే విజయం: నాదెండ్ల మనోహర్**

ఏలూరు: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి గత ఎన్నికల్లో వచ్చిన 11 సీట్లు కూడా దక్కవని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఏలూరు జిల్లా సమీక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, ఐటీ, ఆహార శుద్ధి, గ్రీన్ ఎనర్జీ, పర్యాటక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పారు. మూడు ఎకనామిక్ జోన్ల ద్వారా అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తున్నామని, గూగుల్ డేటా సెంటర్, క్వాంటం వ్యాలీ వంటి పెట్టుబడులతో రాష్ట్రం సాంకేతిక రంగంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**రాయలసీమ నుంచి పరిశ్రమలను తరిమేశారు**

2019--24 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమకు రావాల్సిన పలు పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని మనోహర్ ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వల్లే కియా అనుబంధ సంస్థలు, అమరరాజా, జాకీ, ఏషియా పల్ప్ పేపర్, రిలయన్స్ వంటి పెట్టుబడులు రాష్ట్రానికి దూరమయ్యాయని పేర్కొన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించని వైసీపీ నాయకులు ఇప్పుడు ఉపాధి, పెట్టుబడుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల ముందుకు వెళ్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తాం

### 2026-27లో రూ.147.99 కోట్లు కేటాయింపు: మంత్రి తుమ్మల



**హైదరాబాద్ (వాయిస్‌టుడే):** గత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పక్కన పెట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025--26 నుంచి పథకాన్ని పునరుద్ధరించి అమలు చేస్తున్నామని చెప్పారు.

2025--26లో పథకానికి రూ.71 కోట్లు కేటాయించి రూ.63 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రైతులకు మరింత విస్తృతంగా యాంత్రీకరణ ప్రయోజనాలు అందించేందుకు 2026--27లో రూ.147.99 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర, కేంద్ర వాటాలతో పథకం అమలుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, కేంద్ర మార్గదర్శకాలు అందిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక చేపడతామని పేర్కొన్నారు. రైతులు తమకు నచ్చిన ఎంప్యానెల్ కంపెనీ నుంచి వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసుకునేలా విధానం రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సబ్సిడీని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్న నేపథ్యంలో ధర, నాణ్యతను పరిశీలించి పరికరాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం, బీసీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందుతుందని తుమ్మల తెలిపారు.

## నీళ్లడిగిన రైతులపై కేసులు నమోదు చేస్తారా?

**జూరాల గేట్లు తెరిచిన రైతులపై కేసులను ఖండించిన నిరంజన్‌రెడ్డి**

**14 మంది రైతులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్**



**హైదరాబాద్ (వాయిస్‌టుడే):** జూరాల గేట్లు తెరిచి సాగునీరు విడుదల చేసిన రైతులపై రహస్యంగా కేసులు నమోదు చేయడాన్ని మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. పొలాలు ఎండిపోతున్న పరిస్థితుల్లో నీటి కోసం జూరాల గేట్లు తెరిచిన రైతులపై కేసులు పెట్టడం దుర్మార్గమని విమర్శించారు. కృష్ణారెడ్డి, రాజు, కురుమూర్తి, గోపి, జబ్బార్, షరీఫ్,

- మిగతా 2వ పేజీలో



## మానవీయ విలువలకు ప్రాధాన్యమిచ్చే జైలు వ్యవస్థ అవసరం

### మహిళా జైలు అధికారుల పాత్ర కీలకం: కేంద్ర మంత్రి బండి సంజయ్

**భోపాల్ (వాయిస్‌టుడే):** మానవీయ విలువలకు ప్రాధాన్యమిచ్చే జైలు వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జైలు పరిపాలనలో మహిళా అధికారుల పాత్ర కీలకమని, భవిష్యత్‌లో సాంకేతికతకు మరింత ప్రాధాన్యం పెరగనుందని తెలిపారు. భోపాల్‌లోని సెంట్రల్ అకాడమీ ఫర్ పోలీస్ ట్రైనింగ్ (సీఏపీపీఏటీ)లో బీపీఆర్‌డీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జైలు పరిపాలనలో మహిళా అధికారులు' 5వ జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై

మిగతా 2లో

## 71.23 లక్షల ఓటర్ల పేర్లకు ఆమోదం

### నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా

### 92.88 లక్షల నోటీసుల్లో 71.23 లక్షల మందిని అర్హులుగా గుర్తింపు



**హైదరాబాద్, అక్టోబర్ 8:** తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా 71.23 లక్షల మందిని తుది జాబితాలో చేర్చేందుకు అర్హులుగా గుర్తించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అక్టోబర్ 7 నాటికి నోటీసులపై విచారణ పూర్తిచేసి వారి పేర్లను చేర్చేందుకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఓటర్ల జాబితాలో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక కారణాలతో 92.88 లక్షల నోటీసులు జారీ చేయగా, 91.92 లక్షల నోటీసులను ఓటర్లకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు అక్టోబర్ 7తో ముగిసింది. నవంబర్ 5లోగా అభ్యంతరాలను పరిష్కరించి, నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ఆగస్టు 17న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73.39 లక్షల మందిని

- మిగతా 2వ పేజీలో

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 9 అక్టోబరు 2026

## మండుతున్న ఎండలు రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, అక్టోబరు 8: తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ, రాత్రివేళ ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదుకాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లో 36.2, హైదరాబాద్‌లో 35 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా నిష్క్రమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రానున్న కొద్ది రోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగవచ్చని అంచనా వేశారు.

## నీళ్లడిగిన రైతులపై కేసులు నమోదు చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

శేఖర్‌రెడ్డి, దేవేందర్, సమరసింహ, సద్దల భాను, వేణు, భాస్కర్, లక్ష్మణ్, నరేష్ సహా 14 మంది రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. డీఈతో ఫిర్యాదు చేయించి గత నెల 20న కేసు నమోదు చేయడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. కర్ణాటక పర్యటనకు వెళ్లిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం అక్కడి నుంచి నీటిని తీసుకురావడంలో విఫలమైందని విమర్శించారు. సాగునీరు అందించలేక రైతులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. గతంలో రైతులపై కేసులు నమోదు చేసిన ప్రభుత్వాలకు ఎదురైన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు ఆ పార్టీకి నష్టం కలిగించే పరిస్థితికి దారితీయవచ్చని నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## 71.23 లక్షల ఓటర్ల పేర్లకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

మరణించిన, చిరునామా మారిన లేదా నకిలీ ఓటర్లుగా గుర్తించారు. కాగా, ఒకే ఇంటి నంబర్‌పై 15 లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు ఉన్న కేసులను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించాలని బీజేపీ కోరింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఇలాంటి ఓట్లు సుమారు 1.63 లక్షల వరకు ఉన్నట్లు తమ విశ్లేషణలో తేలిందని, బూత్ స్థాయి అధికారులు వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేసింది.

## మానవీయ విలువలకు ప్రాధాన్యమిచ్చే జైలు వ్యవస్థ అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. మహిళా సిబ్బంది సేవలు, వృత్తిపరమైన అభివృద్ధి, నాయకత్వం, జైలు పరిపాలనలో కొత్త సవాళ్లు, ఉత్తమ విధానాలపై మాట్లాడారు. మహిళా ఖైదీల భద్రత, ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, పిల్లల సంరక్షణ, కుటుంబ సంబంధాలు, వృత్తి శిక్షణ, పునరావాసం వంటి అంశాల్లో మహిళా అధికారుల పాత్ర ప్రత్యేకమైనదన్నారు. జైలు అధికారులు కేవలం సంరక్షకులుగానే కాకుండా మార్పుకు మార్గదర్శకులుగా పనిచేయాలని సూచించారు. జైళ్ల ఆధునీకరణ, ఖైదీల పునరావాసం, సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు జైలు చట్టాలు, నిబంధనల్లో అవసరమైన మార్పులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీపీఆర్‌డీ డీజీ అలోక్ మిత్తల్, ఐజీ జితేంద్ర సింగ్ మీనా, మహిళా జైలు ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, జైలు సంస్కరణ రంగ నిపుణులు పాల్గొన్నారు.




## పెరిగిన ఆర్టీసీ ఎన్నికల వేడి

**39 వేల మందికి పైగా కార్మికుల ఓటు**

**హోరాహోరీగా ప్రచారం.. ప్రధాన డిమాండ్లతో కూటముల మేనిఫెస్టోలు**

హైదరాబాద్, అక్టోబర్ 8: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల వేడి పెరిగింది. దాదాపు పదేళ్ల విరామం తర్వాత రహస్య బ్యాలెట్ ద్వారా జరుగుతున్న ఈ ఎన్నికల్లో 39 వేల మందికి పైగా కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దీంతో ఎన్నికలు కార్మిక వర్గంలోనే కాకుండా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఈసారి పలు కార్మిక సంఘాలు కూటములుగా ఏర్పడి బరిలో నిలిచాయి. తెలంగాణ వర్కర్స్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఒక కూటమిగా, టీజీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ జేఏసీగా, తెలంగాణ జాయింట్ మజ్దూర్ యూనియన్, బహుజన్ వర్కర్స్ యూనియన్ తదితర సంఘాలు మరో కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వంలో విలీనం, వేతన సవరణ, 2017, 2021 బకాయిల చెల్లింపు, 2025 నుంచి రావాల్సిన వేతన సవరణ బకాయిలు, తార్నాక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు, పెన్షన్, పీఎఫ్ బకాయిల పరిష్కారం, కొత్త బస్సుల కొనుగోలు, డిపోల అభివృద్ధి వంటి అంశాలను సంఘాలు ప్రధాన డిమాండ్లుగా ప్రచారం చేస్తున్నాయి. డిపోల వారీగా ప్రచార సభలు నిర్వహిస్తూ కార్మికులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

అక్టోబర్ 9న జరగనున్న ఎన్నికల్లో కార్మికులు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఫలితాలు కార్మిక సంఘాల బలాబలాలతో పాటు ప్రభుత్వ విధానాలపై ఉద్యోగుల అభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# టీ పీసీసీ చీఫ్ సహా పలువురు మంత్రుల అరెస్ట్

## లోక్‌భవన్ ముట్టడికి యత్నించడంతో అదుపులోకి

**హైదరాబాద్ (వాయిస్‌టుడే):** ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ కాంగ్రెస్ చేపట్టిన 'చలో లోక్‌భవన్' ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ నిరసన చేపట్టారు.

నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ లోక్‌భవన్ వైపు సాగింది. లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సహా విపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టి పారదర్శక ప్రక్రియ చేపట్టే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ముట్టడి నేపథ్యంలో లోక్‌భవన్, రాజ్‌భవన్ పరిసరాల్లో పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు.



**'తెలంగాణను టార్గెట్ చేశారు'**

తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కై 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని, బీహార్, పశ్చిమబెంగాల్ తర్వాత తెలంగాణను బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని ఆయన అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనను పదవి నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.

**పోరాటం ఆగదన్న రేవంత్**

ఢిల్లీలో రాహుల్‌గాంధీ సహా విపక్ష నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ఫతేనగర్‌లో నాలా పూడికతీత పనులు

**వరద ముప్పు నివారణకు హైడ్రా చర్యలు**

**మెట్, డీఆర్ఎఫ్ బృందాలతో పనులు.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్**



హైదరాబాద్, అక్టోబర్ 7: వర్షాలు కురిసినప్పుడు ఫతేనగర్, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లో వరద ముంపు సమస్యను నివారించేందుకు హైడ్రా నాలా పూడికతీత పనులు ప్రారంభించింది. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ (మెట్), డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లాంగ్ ఆర్మ్ హ్యాండ్ జేసీబీలతో పూడిక తొలగింపు పనులను పరిశీలించి, నాలా పొడవునా ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాలా ప్రారంభంలో 25 మీటర్లు, ఫతేనగర్ ప్రాంతాల్లో 40 మీటర్ల వెడల్పు ఉండాల్సి ఉండగా ఆక్రమణలతో కుంచించుకుపోయిందని అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరికిచెరువు, ఐడీఎల్ చెరువుల నుంచి వచ్చే కూకట్‌పల్లి వరద కాలువకు గౌతంనగర్ వద్ద ఫాక్స్‌సాగర్ వరద కాలువ కలుస్తుంది. పూడికతో పాటు ఆక్రమణలు, మురుగు, పారిశ్రామిక వ్యర్థ జలాల కారణంగా వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యలపై బాలానగర్ పారిశ్రామికవాడకు చెందిన పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. త్వరలో పారిశ్రామిక యూనిట్ల యజమానులతో సమావేశం నిర్వహించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

## మాటల యుద్ధం.. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**సీఎం కుటుంబంపై ఆరోపణలతో ముదిరిన వివాదం**

**క్రిశాంక్ కేసు.. హైకోర్టు ఆదేశాలతో మరింత వేడి**

హైదరాబాద్, అక్టోబర్ 8: సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల వ్యాపారాలు, ఆస్తులపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ చేసిన ఆరోపణలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం ముదిరింది. సీఎం కుమార్తె నైమిషా రెడ్డికి కొన్ని ఆస్తులు, ఫార్మా సంస్థలతో సంబంధాలున్నాయంటూ క్రిశాంక్ సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేయగా.. కాంగ్రెస్ వాటిని ఖండించింది. ఆరోపణలకు ఆధారాలు లేవని, రాజకీయ ప్రయోజనాల కోసమే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి క్రిశాంక్‌ను అరెస్టు చేశారు. సికింద్రాబాద్ కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించడంతో ఆయనకు ఊరట లభించింది. మరో కేసులో అరెస్టు నుంచి రక్షణ కోరుతూ క్రిశాంక్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు.. బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 35(3) కింద ముందుగా నోటీసు జారీ చేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం దర్యాప్తు కొనసాగించాలని పోలీసులను ఆదేశించింది.

క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ నేతలు రాజకీయ కక్ష సాధింపుగా అభివర్ణిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మరోవైపు సీఎం కుటుంబాన్ని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఆరోపణలు, పోలీసు కేసులు, న్యాయస్థాన జోక్యంతో ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరింత చర్చనీయాంశంగా మారింది.



## రోడ్డు ప్రమాదాల నివారణకు 4E విధానం

**ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న ఏడు జిల్లాల్లో ప్రత్యేక కార్యాచరణ: డీజీపీ సీవీ ఆనంద్**

హైదరాబాద్, అక్టోబర్ 8: తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు 4ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్ అనే నాలుగు అంశాల ఆధారంగా సమగ్ర చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. డీజీపీ కార్యాలయం నుంచి రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి ఏడు జిల్లాల కలెక్టర్లు, నలుగురు పోలీస్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, సేవ్ ఫౌండేషన్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'టార్గెట్ జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్స్ ఇన్ తెలంగాణ'పై సమీక్ష నిర్వహించారు. అధిక ప్రమాదాలు నమోదవుతున్న ఏడు జిల్లాల్లో ప్రతి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించి, పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. బ్లాక్‌స్పాట్లు, రహదారి నిర్మాణ లోపాలు, సైన్‌బోర్డులు, వెలుతురు సమస్యలను గుర్తించి సరిచేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వేగం, డ్రంక్ డ్రైవింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్, పోలీసు, వైద్య బృందాలు స్పందించి గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు చికిత్స అందేలా అత్యవసర సేవలను బలోపేతం చేయాలని డీజీపీ ఆదేశించారు.

## దమ్ముంటే నాపై గెలవండి

**కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్**

హైదరాబాద్, అక్టోబరు 8: ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నిక నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఉప ఎన్నికలో తాడోపేడో తేల్చుకుందామని అన్నారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి నిర్వహించిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొన్న దానం నాగేందర్ మాట్లాడుతూ ఉప ఎన్నికకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తనపై పోటీ చేసి గెలవాలని కేటీఆర్‌ను కోరారు. ఈ ఉప ఎన్నిక కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు రెఫరెండంగా నిలుస్తుందని అన్నారు.

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపై స్పందించిన దానం..




ప్రజల ఓటు హక్కును హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. ఈసీ చర్యలను ప్రశ్నిస్తూ, నిరసనలకు రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు పడటంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.



## ఢిల్లీలో బిజీగా చంద్రబాబు

**కేంద్రమంత్రులతో వరుస భేటీలు.. రాష్ట్ర సమస్యలపై చర్చలు**

న్యూఢిల్లీ, అక్టోబరు 8: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో వరుసగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక పెండింగ్ అంశాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, నిధుల విడుదలపై చర్చించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమైన చంద్రబాబు గోదావరి--కావేరి నదుల అనుసంధానం, దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలు, రాష్ట్ర విభజన హామీల అమలు తదితర విషయాలను ప్రస్తావించినట్లు సమాచారం. గోదావరి--కావేరి అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం చొరవ చూపాలని కోరినట్లు తెలిసింది.

# ఆర్చరీ ప్రీమియర్ లీగ్ సీజన్-2కు ప్రిత్విరాజ్ యోధాస్ జట్టు ప్రకటన





సికింద్రాబాద్, అక్టోబర్ 8 (వాయిస్ టుడే ప్రతినిధి): ఎబిక్స్ గ్రూప్ టైటిల్ స్పాన్సర్‌గా, నటులు రణదీప్ హుడా, లిన్ లైష్రామ్ సహ- యజమానులుగా ఉన్న ప్రిత్విరాజ్ యోధాస్.. ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 కోసం ఎనిమిది మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. కాంపౌండ్, రికర్వ్ విభాగాల్లో పోటీ పడనున్న ఈ జట్టులో అంతర్జాతీయ, భారతీయ ప్రముఖ ఆర్చర్లకు చోటు కల్పించారు. జట్టులో ప్రపంచ నంబర్-1 కాంపౌండ్ ఆర్చర్ ఆంద్రియా బెసెర్రా, ప్రపంచ నంబర్-3 రికర్వ్ ఆర్చర్ మాటియాస్ గ్రాండేతో పాటు అభిషేక్ వర్మ, కీర్తి శర్మ, తిరుమూరు గణేష్ మణి రత్నం, గాథా ఆనంద్రావ్ ఖడకే, రాజ్ కౌర్, జుయెల్ సర్కార్ ఉన్నారు. పురుషులు, మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, వరల్డ్ ఆర్చరీ, వరల్డ్ ఆర్చరీ ఏషియా మద్దతుతో నిర్వహిస్తున్న ఏపిఎల్ లో సీజన్-2లో 10 దేశాలకు చెందిన 48 మంది ఆర్చర్లు ఆరు ఫ్రాంచైజీల తరఫున పోటీ పడనున్నారు. అక్టోబర్ 8 నుంచి 18 వరకు హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్‌లో ఈ పోటీలు జరగనున్నాయి.

గత సీజన్‌లో టైటిల్‌కు చేరువై ఒక్క షూట్-ఆఫ్ తేడాతో ఓడిపోయిన ప్రిత్విరాజ్ యోధాస్.. ఈసారి మరింత బలమైన జట్టుతో బరిలోకి దిగుతోంది. టైటిల్ గెలవడమే లక్ష్యమని సహ-యజమానులు రణదీప్ హుడా, లిన్ లైష్రామ్ తెలిపారు. యువత, ముఖ్యంగా బాలికలు ఆర్చరీని ప్రొఫెషనల్ కెరీర్‌గా ఎంచుకునేలా ఏపిఎల్ ప్రేరణ కల్పిస్తోందని పేర్కొన్నారు. సీజన్-2లో ప్రపంచ నంబర్-1 రికర్వ్ ఆర్చర్ మార్కస్ డి'అల్మెయిడా, టోక్యో ఒలింపిక్ ఛాంపియన్ మెటె గాజోజ్, పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత కేసీ కౌఫ్‌హోల్డ్ తదితరులు పాల్గొననున్నారు. లీగ్ మ్యాచ్‌లు ప్రతిరోజూ సాయంత్రం 7:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు జరగనున్నాయి. అగ్రస్థానంలో నిలిచే నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకోగా, అక్టోబర్ 18న ఫైనల్ నిర్వహించనున్నారు. మ్యాచ్‌లను SonyLIV, Archery+లో ప్రసారం చేయనున్నారు.



## చలో లోక్‌భవన్‌లో కాంగ్రెస్ నేతల నిరసన

### ఎస్ఐఆర్ అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీనామా చేయాలి

హైద్రాబాద్ (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి ఆదం సంతోష్‌తో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శులు గండికోట కుమార్, రాజేందర్ యాదవ్ పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగినట్లు పేర్కొంటున్న అక్రమాలు, అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా ఒకతాటిపైకి వచ్చి పోరాడాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. లోక్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గండికోట కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సికింద్రాబాద్, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

### ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం..

### మోతె శోభన్‌రెడ్డి, మోతె శ్రీలత..

సికింద్రాబాద్, అక్టోబర్ 8 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో లోక్‌భవన్' నిరసన ర్యాలీలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు మోతె శోభన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ లోక్‌భవన్ వైపు కొనసాగింది. ఈ సందర్భంగా మోతె శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. మోతె శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి ప్రజా ఉద్యమంలో తాము భాగస్వాములుగా ఉంటామని మోతె శోభన్‌రెడ్డి, మోతె శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు.

## బహదూర్ పల్లి 294 డివిజన్లో 32 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు

### ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08(వాయిస్ టుడే ): ప్రజలు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారంగా, గండి మైసమ్మ సర్కిల్ నుండి పిస్తా హౌస్ మీదుగా పోచంపల్లి చింతకుంట వరకు భూగర్భ డ్రైనేజీ పనులకు రూ. 32 లక్షల వ్యయంతోలి కాంగ్రెస్ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పనులను ప్రారంభించారు. ఈ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవడం, దుర్గంధం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ఈ యూజీడీ లైన్ ఎంతో ఉపయోగపడుతుంది. పనులు ప్రారంభించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు , స్థానిక ప్రజలు కిషోర్ రెడ్డి కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి మాజీ కౌన్సిలర్ రాము గౌడ్ తలారి యాదగిరి ముదిరాజ్ , ఏఆర్ సాదు యాదవ్ మైనార్టీ నాయకులు అక్బర్ భాయ్ అమర్ పటేల్ మరియు స్థానిక నాయకులు పాల్గొనడం జరిగింది.



## దుర్గామాత ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

### నిమజ్జనం వరకు అప్రమత్తంగా ఉండాలి

### అదనపు డీసీపీ నరసయ్య

సికింద్రాబాద్, అక్టోబర్ 8 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్ పరిధిలో దుర్గామాత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అడిషనల్ డిసిపి నరసయ్య సూచించారు. గురువారం సికింద్రాబాద్ జోన్ పరిధిలోని దుర్గామాత విగ్రహాల నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి పూజా కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం వరకు నిర్వాహకులు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అదనపు డీసీపీ నరసయ్య వివరించారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు శాఖ అందించే సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. దుర్గామాత ఉత్సవాలను భక్తి, శ్రద్ధలతో పాటు సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏసీపీలు జి.జగన్, శశాంక్ రెడ్డి, సిహెచ్ శ్రీధర్, ఎ. యాదగిరి, జి. రన్వీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రారంభమైన నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు

మేడిపల్లి/సికింద్రాబాద్, అక్టోబర్ 08 (వాయిస్ టుడే ప్రతినిధి): నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "నారాయణ ప్రీమియర్ లీగ్" క్రీడా పోటీలు బోడుప్పల్ నారాయణ హైస్కూల్‌లో గురువారం అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎమ్ గోపాల్ రెడ్డి, ఏజీఎమ్ బాలపరమేశ్వర రావు, ఆర్ అండ్ డి హెడ్స్, కో-ఆర్డినేటర్లు హాజరై పోటీలను ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ --- "విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. క్రీడలు శారీరక దృఢత్వాన్ని అందించడమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయి. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇటువంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయి" అని పేర్కొన్నారు.?అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ కే. మహేశ్వరీ,నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ .. "ఎన్ పి ఎల్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి ఒక మంచి వేదికను కల్పిస్తున్నాం. భవిష్యత్తులో మన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహించడమే మా ముఖ్య ఉద్దేశం" అని తెలిపారు.?ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.





## మాదకద్రవ్యాల బారిన పడిన వారికి పునరావాసమే లక్ష్యం

### గాంధీ ఆస్పత్రిలో నార్కోటిక్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్, అక్టోబర్ 8 (వాయిస్ టుడే ప్రతినిధి): మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన యువతను తిరిగి సాధారణ జీవనంలోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నార్కోటిక్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని సందర్శించిన ఆయన.. చికిత్స పొందుతున్న నార్కోటిక్ అనుమానితులను కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, బాధితుల కుటుంబ సభ్యులు, అనుమానితులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడిన ప్రతి ఒక్కరిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయడం తమ ఉద్దేశం కాదని డీసీపీ తెలిపారు. ముఖ్యంగా తొలిసారి పట్టుబడిన వారికి వైద్య చికిత్సతో పాటు మానసిక నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ అందించి వ్యసనం నుంచి బయటపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 'నశా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 52 మందిని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. వారికి 15 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్సతో పాటు కౌన్సెలింగ్ కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణలో 33 డీ-అడిక్షన్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ కేంద్రాల్లో మాదకద్రవ్యాల వినియోగదారులకు ఉచిత వైద్య సేవలతో పాటు సైకియాట్రిస్టుల కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మాదకద్రవ్యాల వ్యసనం నుంచి పూర్తిగా బయటపడి ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలని బాధితులకు డీసీపీ సూచించారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్, ఆర్ఎంఓ నవీన్, ఫోరెన్సిక్ హెచ్ఓడీ ప్రొఫెసర్ నాగ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
శుక్రవారం 9 అక్టోబరు 2026

# ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం

**ఓటర్ల సవరణలో అవకతవకలపై చలో లోక్‌భవన్**

**షర్టు చిరిగిన సర్ పై పోరాటం ఆగదు**

**సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి**

**బేగం బజార్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బి అభిషేక్ కుమార్ యాదవ్**



హైద్రాబాద్ (వాయిస్ టుడే) : ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని బేగంబజార్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బి అభిషేక్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఓటర్లు సవరణలో అవకతవకలపై సి ఈ సి జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో అవకతవకలను నిరసిస్తూ చేపట్టిన చలో లోక్‌భవన్ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అరవింద్ కుమార్ యాదవ్ నేతృతంలో అభిషేక్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిషేక్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న అత్యంత కీలకమైన హక్కు అని, ఆ హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం సమగ్రంగా స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు.

**ఓటర్ల జాబితాలో పారదర్శకత ఉండాలి**

ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందని అభిషేక్ అన్నారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకమైన విధానాన్ని పాటించాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హమైన తొలగింపులు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

**నిరసనకారుల అరెస్టును ఖండిస్తున్నాం**

లోక్‌భవన్ వద్ద నిరసన చేపట్టిన తమను పోలీసులు అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషనులకు తరలించారని అభిషేక్ తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ, ఇండియా కూటమి ఎంపీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం పరిష్కారం కాదని, అరెస్టులతో ప్రజల గొంతును అణచలేరని ఓటు హక్కు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం మా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నాం

**- బిఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు జనం మెచ్చిన నేత, కుత్బుల్లాపూర్ సంక్షేమ ప్రదాత, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రజా సంక్షేమమే పరమావధిగా, నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.



## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళు
_న్నామని తెలియజేశారు.



## కొంపల్లిలో ఘనంగా అంగన్ మిలన్ సేవ కార్యక్రమం

**అంగన్వాడి ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి**

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08(వాయిస్ టుడే ): భారత ప్రధాని, కారణజన్ములు, శ్రీమాన్ నరేంద్ర మోడీ నిర్విరామంగా 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు మరియు మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి సూచన మేరకు, బిజెపి కొంపల్లి డివిజన్ అధ్యక్షుని బాధ్యతలు అంగన్ మిలాన్ సేవ కార్యక్రమం నిర్వహించాను. కార్యక్రమంలో భాగంగా కొంపల్లి డివిజన్ పరిధిలోని ఐదు అంగన్వాడి కేంద్రాలను మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి రాష్ట్ర మహిళా మోచ నాయకురాలు సరితరావు గరతో కలిసి సందర్శించి అంగన్ వాడి ఉద్యోగులను మరియు సేవకులను సత్కరించాము. చాలీచాలని జీతాలతో అంగన్ వాడి ఉద్యోగులు మరియు సహాయకులు చేస్తున్న సేవలు అభినందనీయం. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పండ్లు పంపిణీ చేశాను. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శంకర్ నాయక్, మధు, మాధురి, మహేందర్ సాగర్, అస్కానిక్ సతీష్, సాంబ తదితరులు పాల్గొన్నారు..



## అభివృద్ధి పనులతో సమస్యల పరిష్కారం

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయిస్తూ పనులను చేపడుతున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.కాప్రా సర్కిల్ పరిధిలోని సాకేత్ ఎక్స్ టెన్షన్‌లో డ్రైనేజీ పనులకు రూ.6.92 లక్షల నిధులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మంజూరు చేయించారు. గురువారం సాకేత్ ఎక్స్ టెన్షన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులకు పరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. అదే విధంగా వంపుగూడలోని రెడ్డి కాలనీలోనూ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.22. 56 లక్షల నిధులను సైతం పరమేశ్వర్ రెడ్డి మంజూరు చేయించారు. రెడ్డి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాలను పరమేశ్వర్ రెడ్డి అంద చేశారు. ఆయా కాలనీల కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ ఐ ఆర్ అక్రమాలపై భారీ నిరసన మార్చ్‌లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 8(వాయిస్ టుడే ): హైదరాబాద్: ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, అవకతవకలకు నిరసనగా ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన భారీ నిరసన మార్చ్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, ఓటర్ల జాబితాలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు, మంత్రివర్యులు, డీసీసీ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్ సి , ఎస్ టీ , న్ ఎస్ యూ ఐ , ఐ న్ టీ యూ సి విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం.. కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు.




## కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చలో లోక్ భవన్" ముట్టడి

ఉప్పల్( వాయిస్ టుడే ప్రతినిధి ):- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన "చలో లోక్ భవన్" కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీలో పీసీసీ అధ్యక్షులు, మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజహరుద్దీన్, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి,నర్స రెడ్డి, భూపతి రెడ్డి, ఇండియా కూటమి నాయకులు, ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు తమ అభిప్రాయాలను బలంగా వ్యక్తం చేశారు.

## కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఎన్నికలపై కాంగ్రెస్ నేతల సమీక్ష

**ప్రతి ఓటరును కలుపుకుని కూటమి విజయానికి కృషి చేయాలి**



కూకట్‌పల్లి: అక్టోబర్ 8(వాయిస్ టుడే): కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో డిపో గౌరవ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, భరత్‌నగర్ కాలనీ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిళ్ల వెంకటేష్ యాదవ్ స్థానిక డిపో కమిటీ సభ్యులతో సమావేశమై ఎన్నికలపై చర్చించారు. ప్రతి ఓటు కీలకమని, కార్మికుల సంక్షేమం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించి కూటమి విజయానికి కృషి చేయాలని సూచించారు. అలాగే అందరినీ కలుపుకొని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో కమిటీ సభ్యులు అశోక్, శివ ముదిరాజ్, ఉపేందర్ యాదవ్, రామ్‌రెడ్డి, లక్ష్మీ, సత్తెమ్మ, ఉమ తదితరులు పాల్గొన్నారు.



## కేపీహెచ్‌బీలో నంబర్ 1లో అనుటెక్స్‌ను నూతన షోరూం ప్రారంబించిన నిధి అగర్వాల్

కూకట్ పల్లి :అక్టోబర్ 8(వాయిస్ టుడే): కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లో అనుటెక్స్ నూతన షోరూంను సినీ నటి నిధి అగర్వాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 1970లో ప్రారంభమైన అనుటెక్స్ ఐదు దశాబ్దాలకు పైగా నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలతో వినియోగదారుల ఆదరణ పొందుతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఒక చీర కొనుగోలుపై మరో చీర రూ.1కే, రూ.4,999 కొనుగోలుపై వెండి నాణెం, రూ.7,999పై బంగారు నాణెం, రూ.1,499పై ఉచిత బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నాగేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనుటెక్స్‌ను మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.



## భౌరంపేట్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా దుర్గామాత ఆగమన

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లో భౌరంపేట్ మిత్ర మండలి ఆధ్వర్యంలో దుర్గామాత ఆగమన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, భక్తి గీతాల నడుమ దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠా స్థలానికి చేర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, స్థానికులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు.

# సాకి చెరువు కట్టపై బతుకమ్మ వేడుకలకు భారీ ఏర్పాట్లు

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు..

### సినీ, జానపద కళాకారులతో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు



పటాన్ చెరు (వాయిస్ టుడే): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పటాన్చెరు నియోజకవర్గంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) తెలిపారు. గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై అక్టోబర్ 18న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకల కోసం చేపడుతున్న ఏర్పాట్లను సైబరాబాద్ మునిసిపల్ అధికారులతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

సద్దుల బతుకమ్మ సందర్భంగా పటాన్చెరు, జెపి కాలనీ డివిజన్లో పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన వేలాది మంది మహిళలు సాకి చెరువు కట్టకు తరలి వస్తారని.. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళలు, కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక లైటింగ్, విశాలమైన పార్కింగ్, ఆకర్షణీయమైన వేదిక, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బతుకమ్మలను నిమజ్జనం చేసే ఘాట్ వద్ద భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకల్లో సినీ, జానపద కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో సాకి చెరువు కట్టకు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి బతుకమ్మ వేడుకలను ఘనంగా, సురక్షితంగా, పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. సాకి చెరువుతోపాటు బండలగూడ, రామచంద్రాపురం, అమీన్పూర్, బీరంగూడ, తెల్లాపూర్, ముత్తంగి, బొల్లారం పరిధిలోని బతుకమ్మ ఘాట్లను సైతం సద్దుల బతుకమ్మ పండుగకు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిఈ కృష్ణవేణి, ఏఈలు లావణ్య, ఫైజన్, తదితరులు పాల్గొన్నారు.



## పోషకాహార భద్రతతోనే ఆరోగ్య సమాజం

### మహిళల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించాలి

### గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే): మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి, సమతుల్య ఆహారంపై అవగాహన పెంపొందించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్--పోషణ మాసం వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలకు అందిస్తున్న పోషకాహార సేవలు, ఆరోగ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన కుటుంబానికి మహిళల ఆరోగ్యం పునాది వంటిదని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోషకాహార లోపం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల చిన్నారులకు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటిలో పోషకాహారంపై అవగాహన పెరిగితేనే సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. పోషణ్ అభియాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై గ్రామాలు, కాలనీల్లో మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ జయరాం నాయక్, ఎంఈఓ నాగేశ్వరరావు నాయక్, రామ్మోహన్, అంగన్వాడీ సిబ్బంది, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి మైనారిటీ కాంగ్రెస్ చైర్మన్‌గా చున్ను పాషా

### బండి రమేష్ మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి



కూకట్‌పల్లి: అక్టోబర్ 8(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎం.డి. చున్ను పాషా నియమితులయ్యారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని మెడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా మైనారిటీ చైర్మన్ మీర్జా అజీజుల్లా బేగ్ (అజీజ్) తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ ఇర్ఫాన్ జీ ఆమోదంతో నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మార్గదర్శకత్వంలో మైనారిటీ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని చున్ను పాషాకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మైనారిటీ వర్గాలను కాంగ్రెస్‌కు మరింత చేరువ చేయాలని కోరారు.



## పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌కు సన్మానం

హిమాయత్ నగర్, అక్టోబర్ 08: గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్ గోపిశెట్టి ప్రమోద్, నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌ను కలిసి అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించిన పోలీస్ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## రాహుల్ అరెస్టు.. ప్రజాస్వామ్య గొంతు నొక్కే కుట్ర..

### ప్రశ్నించే నాయకుడిని అణచలేరు..

### అడ్డగోలు ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ పోరాటం ఆగదు..

### కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేంద్ర కుమార్ రాజీనామా చేయాలి : నీలం మధు ముదిరాజ్..

### గురువారం టీపీసీసీ, ఇండియా బ్లోక్ పార్టీల ఆధ్వర్యంలో చలో లోక్ భవన్ కార్యక్రమం పాల్గొన్న నీలం మధు ముదిరాజ్..

### అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

పటాన్ చెరు (వాయిస్ టుడే): కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడికి నిదర్శనమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తీవ్రంగా విమర్శించారు. రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం టీపీసీసీ, ఇండియా బ్లాక్ పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు నుండి లోక్ భవన్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్తున్న నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి వివిధ ఠాణాలకు తరలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ బాధ్యత అని, అలాంటి గొంతును అణచివేసేందుకు అరెస్టులను ఆయుధంగా ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వమే ప్రశ్నించే గొంతులను అణచివేసే విధానాలను అవలంబిస్తోందని నీలం మధు మండిపడ్డారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం నేరం కాదని, ప్రజల తరఫున నిలబడటం ప్రతిపక్షాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని అరెస్టు చేసినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని, ప్రజా సమస్యలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని అన్నారు. అరెస్టులు, కేసులు, బెదిరింపులతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే అది సాధ్యం కాదని నీలం మధు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి పోరాటం కొత్త కాదని, దేశ స్వాతంత్ర్యం నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణ వరకు అనేక సందర్భాల్లో పార్టీ ప్రజల పక్షాన నిలిచిందని గుర్తుచేశారు. నేడు కూడా అదే స్ఫూర్తితో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్నామని తెలిపారు.

రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తోందని నీలం మధు అన్నారు. ఓటు చోరీలో భాగంగా బీజేపీ చేతిలో కీలు బొమ్మగా మారిన కేంద్ర ఎన్నికల కమిషన్ తప్పిదాలను నిలదీస్తున్నందుకే రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల గొంతుకగా నిలిచిన నాయకుడిపై ఎన్ని ఆంక్షలు విధించినా ఆయన పోరాటాన్ని ఆపలేరని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న వారు రాజ్యాంగ సంస్థలను, ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత పోరాటం ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున్న పాల్గొన్నారు..



## బాలాజీనగర్ వార్డులో సమస్యల పరిష్కారంపై అధికారుల సమీక్ష

### కమిషనర్ ఆదేశాలతో వార్డు రీవిజిట్ కార్యక్రమం

### పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

కూకట్‌పల్లి: అక్టోబర్ 8(వాయిస్ టుడే): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి సర్కిల్-52 డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ వార్డులో రీవిజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో నిర్వహించిన వార్డు స్థాయి కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలు, ప్రజల ఫిర్యాదులపై పురోగతిని సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) ప్రతినిధులు చురుకుగా పాల్గొని తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గత వార్డు కార్యక్రమానికి సంబంధించిన మినిట్స్ ఆఫ్ మీటింగ్ (ఎంఓఎం)లో నమోదైన సమస్యలు, చేపట్టిన చర్యలు, ప్రస్తుత పురోగతిపై డిప్యూటీ కమిషనర్ ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), ఏఈఈ--ఎస్‌డబ్ల్యూఎం, మేనేజర్--యూబీడీతో పాటు ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వార్డు స్థాయి సమస్యల పరిష్కారంలో ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందిస్తున్న సహకారం, సమన్వయాన్ని అధికారులు అభినందించారు. సమస్యలపై నిరంతర పర్యవేక్షణ, ఫాలోఅప్‌తో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## పరిశ్రమకు కొత్త టెక్నాలజీని సృష్టించే నిపుణులు అవసరం

### ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్ డీన్ ప్రొఫెసర్ పి.వి.సుధ




హైదరాబాద్, అక్టోబర్ 08: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, మారుతున్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్ డీన్ ప్రొఫెసర్ పి.వి.సుధ పిలుపునిచ్చారు. అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల చైర్మన్ ఎం.శ్రీనివాస్ రావు అధ్యక్షతన గురువారం నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఘన స్వాగతం పలుకుతూ 'ఆరంభ్ -- 2026' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుధ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఛాట్‌జీపీటీ, క్లాడ్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాలను కేవలం అసైన్‌మెంట్ల కోసం మాత్రమే కాకుండా, లోతైన పరిశోధనలు మరియు కోడింగ్ పరిజ్ఞానం పెంచుకోవడానికి ఉపయోగించాలని సూచించారు. "పరిశ్రమకు కేవలం టూల్స్ వాడటం తెలిసిన వారు కాదు, కొత్త టెక్నాలజీని సృష్టించే నిపుణులు అవసరం" అని ఆమె స్పష్టం చేశారు. ఓయూ ఎంసీఏ సిలబస్‌ను ఇంజనీరింగ్‌కు సమానంగా, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా రూపకల్పన చేశామని తెలిపారు. రోజూ పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా పునశ్చరణ చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, మార్కుల కంటే సబ్జెక్ట్ పరిజ్ఞానమే ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు.

కళాశాల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 1992లో కేవలం 9 మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ విద్యాసంస్థలు, నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లోని 20 కాలేజీల ద్వారా 20,000 మంది విద్యార్థులకు విద్యనందిస్తున్నాయని తెలిపారు. గడిచిన 30 ఏళ్లలో లక్షలాది మందికి నాణ్యమైన విద్యనందించామని, రాబోయే రోజుల్లో అవంతి విద్యాసంస్థలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలోనే ఎంసీఏ, ఎంబీఏ కోర్సులను ప్రవేశపెట్టిన నాలుగో ప్రైవేట్ సంస్థగా అవంతికి సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు, టి.ఎస్. స్మృతి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఎం.ప్రియాంక, డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ స్వాతి, డాక్టర్ ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 9 అక్టోబరు 2026



## నట విశ్వరూపం..!

మానవతా ప్రతిరూపం.. నానా పటేకర్ !
నిశ్శబ్దంలోనే నిప్పులు కురిపించే నేత్రాలు ఆయన సొంతం..!
డైలాగ్ చెబితే గుండెల్లో రైళ్లు పరిగెత్తే గంభీర స్వరం..!
తెరపై ఆయన కనిపిస్తే చాలు...
నటనకు కొత్త నిర్వచనం పుట్టుకొస్తుంది..!
సింహం లాంటి గర్జన తో విలనిజానికి వణుకు పుట్టించగలరు..!
సగటు మనిషి ఆక్రందన తో కళ్లకు కన్నీరు తెప్పించగలరు..!
'క్రాంతివీర్'లో అన్యాయంపై ఎదిరించిన విప్లవ కెరటం ఆయన,
'వెల్కమ్'లో ఉదయ్ శెట్టి గా నవ్వించిన హాస్య కిరీటం ఆయన !
కేవలం వెండితెరపై నటుడిగానే మిగిలిపోలేదు..ఆయన..
'నామ్ ఫౌండేషన్' స్థాపించి
రైతుల కన్నీళ్లు తుడిచిన మహోన్నతుడు ఆయన..!
ఆడంబరాలకు దూరంగా.., సామాన్య జీవితానికి దగ్గరగా..!
సమాజం కోసం తపించే ఒక నిజమైన నాయకుడు..!
ఆయన నవ్వులో ఒక అమాయకత్వం ఉంటుంది..!
ఆయన కోపంలో ఒక సామాజిక ఆవేదన కనిపిస్తుంది..!

కళకు ప్రాణం పోస్తూ.., మానవత్వానికి
నిలువెత్తు రూపంగా నిలిచిన, ఓ అద్భుత నట శిఖరం..!
ఈ నానా పటేకర్ కు అక్షర నీరాజనం !!

– గిరి ప్రసాద్ సోముల,జర్నలిస్ట్

## నిద్ర విశ్రాంతి మాత్రమే కాదు.. ఆరోగ్యానికి పెట్టుబడి

**సరైన నిద్రతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు**

**డాక్టర్ డి.సి. తిరుపతిరావు**



కరీంనగర్: ఆహారం, నీరు ఎంత అవసరమో నిద్ర కూడా అంతే అవసరమని చైతన్య హాస్పిటల్ సీనియర్ వైద్యులు డాక్టర్ డి.సి. తిరుపతిరావు తెలిపారు. రోజంతా పనిచేసిన శరీరం, మెదడుకు నిద్ర సహజ విశ్రాంతిని అందిస్తుందని, తగినంత నిద్ర లేకపోతే శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. నిద్ర సమయంలో మెదడు సమాచారాన్ని క్రమబద్ధీకరించడంతో పాటు కణజాలాల మరమ్మతు, కండరాల పునరుద్ధరణ, రోగనిరోధక వ్యవస్థ పనితీరు వంటి ప్రక్రియలు జరుగుతాయని తెలిపారు. పెద్దలు సాధారణంగా రోజుకు 7--9 గంటలు నిద్రపోవాలని సూచించారు. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రించడం, మేల్కొనడం, పడుకునే ముందు మొబైల్ ఫోన్, టీవీ వినియోగాన్ని తగ్గించడం, రాత్రివేళ కాఫీ, టీ, అధిక ఆహారం తీసుకోకపోవడం మంచిదన్నారు. తరచూ నిద్ర పట్టకపోవడం, రాత్రివేళ పదేపదే మేల్కొనడం, ఉదయం అలసటగా ఉండటం, గట్టిగా గురక పెట్టడం, నిద్రలో ఊపిరి ఆగినట్లు అనిపించడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఇలాంటి సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మంచి నిద్ర, సమతుల్య ఆహారం, వ్యాయామం, ప్రశాంతమైన మనసు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని డాక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు.




## బతుకమ్మ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు

హబ్సిగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ప్రజలు సురక్షితంగా, ఆనందంగా చేసుకునేలా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలన్నారు. తాగునీరు, వీధి దీపాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జడ్సీ రాధికాగుప్తా, అదనపు కమిషనర్ రఘుప్రసాద్, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతను ఆలోచనాత్మకంగా ఉపయోగించాలి

**గీతం విద్యార్థులకు సూచించిన టీసీఎల్ విభాగాధిపతి డాక్టర్ ఇంద్రాని ప్రమోద్ కెల్కర్**




పటాన్ చెరు (వాయిస్ టుడే): ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను విద్యార్థులు పెంపొందించుకోవాలని, సాంకేతికతను ఆలోచనాత్మకంగా ఉపయోగించాలని హైదరాబాదులోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టీసీఎస్ ఐయాన్ నాణ్యత (క్వాలిటీ), విశ్లేషణ (అనలిటిక్స్) విభాగాధిపతి డాక్టర్ ఇంద్రాని ప్రమోద్ కెల్కర్ సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు లోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో 'సాంకేతికత, మానసిక ఆరోగ్యం' అనే అంశంపై గురువారం ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఆరోగ్యానికి సంబంధించిన–మేధోపరమైన, పర్యావరణ, సామాజిక, భావోద్వేగ, ఆర్థిక, ఆధ్యాత్మిక, వృత్తిపరమైన, శారీరక వంటి ఎనిమిది అంశాల మధ్య సమతుల్యతను పాటించాలని ఆమె స్పష్టీకరించారు.

మానసిక ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ కెల్కర్ నొక్కి చెబుతూ, టెక్నాలజీ ఒక విలువైన వనరుగానూ, అదే సమయంలో ఒత్తిడికి కారణమయ్యే అంశంగానూ ఎలా ఉండగలదో వివరించారు. మానసిక ఆరోగ్య సమాచారం, ఆన్ లైన్ కౌన్సెలింగ్, తోటివారి మద్దతు, అభ్యాస వనరులు, సంపూర్ణ శ్రేయస్సు ద్వారా సాంకేతికత వల్ల కలిగే సానుకూల ప్రభావాలను ఆమె చర్చించారు. అదే సమయంలో, అధిక స్క్రీన్ సమయం, సోషల్ మీడియా వాడకం, సాంకేతిక పరికరాలను ఎక్కువగా ఉపయోగించడం (డిజిటల్ ఓవర్ లోడ్), సైబర్ బెదిరింపులు, సామాజిక పోలిక, నిద్రకు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యా షెడ్యూల్స్ ఒత్తిడి (డిమాండింగ్ అకడమిక్ షెడ్యూల్స్), ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం, సరిపోని నిద్ర కారణంగా ఇంజనీరింగ్, ఐటీ విద్యార్థులు ముఖ్యంగా ఒత్తిడి, తీవ్రమైన మానసిక అలసట (బర్న్ అవుట్)కు గురయ్యే అవకాశం ఉందని కెల్కర్ చెప్పారు. భవిష్యత్ సాంకేతిక నిపుణులుగా విద్యార్థులు తమ డిజిటల్ శ్రేయస్సుకు బాధ్యత వహించాలని, అభ్యాసం, ఉత్పాదకత, సృజనాత్మకత, స్థితిస్థాపకతను పెంపొందించడానికి సాంకేతికతను ప్రయోజనకరంగా ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. డిజిటల్ అలవాట్లు, డిజిటల్ డిటాక్స్, మానసిక ఆరోగ్యానికి సాంకేతికత ఏవిధంగా మరింత తోడ్పడగలదు అనే అంశాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని డాక్టర్ కెల్కర్ సూచించారు. గీతం మహిళా సాధికారత సెల్ ఛైర్ పర్సన్ డాక్టర్ ప్రీతి పర్వేకర్, సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**గీతంలో ఎన్.సి.సి. ర్యాంక్ ప్రదానోత్సవం**

నాయకత్వం, క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతకు గుర్తింపుగా వివిధ ర్యాంకులకు పదోన్నతి పొందిన క్యాడెట్లను గీతం ఎన్.సి.సి. హైదరాబాద్ 33 (టి) బెటాలియన్, సంగారెడ్డి గురువారం నిర్వహించిన ర్యాంక్ ప్రదానోత్సవంలో సత్కరించింది. ఈ వేడుకలో క్యాడెట్లు లాన్స్ కార్పోరల్, కార్పోరల్, సార్జంట్, కంపెనీ సార్జెంట్ మేజర్, కంపెనీ క్వార్టర్ మాస్టర్ సార్జెంట్, జూనియర్ అండర్ ఆఫీసర్, సీనియర్ అండర్ ఆఫీసర్ ర్యాంకులకు పదోన్నతి పొందారు. కొత్తగా పదోన్నతి పొందిన క్యాడెట్లను అభినందించి, వారి బాధ్యతలను గర్వం, నిజాయితీ, క్రమశిక్షణతో నిర్వర్తించాలని ప్రోత్సహించారు.

ఎన్.సి.సి. ర్యాంకులు విశ్వాసం, బాధ్యత, నాయకత్వం, సేవకు ప్రతీకలని నిర్వాహకులు ప్రకటించారు. క్యాడెట్లు ఆదర్శంగా నిలిచి తమ తోటి క్యాడెట్లకు స్ఫూర్తినివ్వాలని సూచించారు. కొత్తగా పదోన్నతి పొందిన క్యాడెట్లు తమ కొత్త పాత్రలు, బాధ్యతలలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ చేసిన కరతాళ ధ్వనులతో ఈ వేడుక ముగిసింది. పదోన్నతి పొందిన క్యాడెట్లు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ విలువలను నిలబెడతారని, వారి ఆదర్శప్రాయమైన ప్రవర్తన, నిబద్ధత ద్వారా గీతంకు గర్వకారణంగా నిలుస్తారని గీతం ఎన్.సి.సి. యూనిట్ విశ్వాసం వ్యక్తపరిచింది.



## విద్యా నాయకత్వానికి ప్రతిష్ఠాత్మక గుర్తింపు

**బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ నడిపల్లి వెంకటేశ్వరరావుకు 'డైనమిక్ ప్రిన్సిపాల్ అవార్డు'**

హనుమకొండ, అక్టోబర్ 08: విద్యా రంగంలో చురుకైన నాయకత్వం, అంకితభావం, నూతన ఆలోచనలతో విశిష్ట సేవలందిస్తున్న బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ లయన్ డాక్టర్ నడిపల్లి వెంకటేశ్వరరావుకు ప్రతిష్ఠాత్మక 'డైనమిక్ ప్రిన్సిపాల్ అవార్డు' లభించింది. హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా ఎడ్యుకేటర్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్--2026లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యా రంగంలో ఆయన అందిస్తున్న సేవలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, సంస్థను నాణ్యమైన విద్యకు వేదికగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎడ్యుకేషన్ న్యూస్ నెట్‌వర్క్ (ఈఎన్ఎన్) ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. అవార్డు తనకు వ్యక్తిగత గౌరవమే కాకుండా బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కుటుంబం మొత్తానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు.

పాఠశాల అభివృద్ధిలో నిరంతరం సహకరిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యం, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల్లో విద్యతో పాటు సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించే దిశగా పాఠశాల మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. డాక్టర్ నడిపల్లి వెంకటేశ్వరరావుకు ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడం పట్ల పలువురు ప్రముఖులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు, విద్యారంగ నిపుణులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. వరంగల్ విద్యా రంగానికి ఇది గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## రాహుల్, ప్రియాంక అరెస్టును ఖండించిన బొమ్మ శ్రీరామ్

**ఓటర్ల సవరణలో అక్రమాలను నిరసిస్తూ చలో లోక్‌భవన్**



హైదరాబాద్: ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలను నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ, ఇండియా కూటమి ఎంపీల అరెస్టును తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఖండించారు. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన 'చలో లోక్‌భవన్' నిరసనలో శ్రీరామ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్‌రెడ్డి విజయం ఖాయం

**కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుపై మంత్రి పొంగులేటి ధీమా**

హైదరాబాద్: నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయం సాధిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం సచివాలయంలో సర్వోత్తమ్‌రెడ్డి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన, పార్టీ పట్ల నిబద్ధత, పట్టభద్రులు, ఉద్యోగ వర్గాలతో ఉన్న అనుబంధం సర్వోత్తమ్‌రెడ్డికి కలిసొస్తాయని పొంగులేటి పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు, పట్టభద్రులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఎన్నికల్లో ముందుకు సాగాలని సర్వోత్తమ్‌రెడ్డికి సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

**తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లయింట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు**



హైదరాబాద్, అక్టోబర్ 08: విద్యార్థి దశ వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తుకు బలమైన పునాది వంటిదని తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లయింట్ అథారిటీ సభ్యులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. బర్కత్‌పురలోని హైందవి డిగ్రీ కళాశాలలో 'ఫ్రెషర్స్ వెల్కమ్ కార్నివాల్' మరియు 'గ్రాడ్యుయేషన్ డే -2026' వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హైందవి విద్యా సంస్థల ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నిరంతర శ్రమ, దృఢ సంకల్పంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని చెప్పారు. విద్యతో పాటు సామాజిక బాధ్యత, చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం అవసరమని అన్నారు.

అనంతరం, నూతనంగా కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలకడంతో పాటు, కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఆయన ప్రదానం చేశారు. ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లోకి అడుగుపెడుతున్న గ్రాడ్యుయేట్లకు సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ జే. నర్సయ్య శుభాకాంక్షలు తెలిపారు. విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో భాగంగా నూతన విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత, నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలతో వేడుక ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ అభ్యంతరాలు.. జహీరాబాద్‌లో జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో

**రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టు అప్రజాస్వామికం**

**జహీరాబాద్ యూత్ కాంగ్రెస్ నేతలు**

**సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్**

జహీరాబాద్,వాయిస్ టుడే అక్టోబర్ 8: ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఢిల్లీలో నిరసన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జహీరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహారెడ్డిల నేతృత్వంలో పట్టణ పరిధిలోని జాతీయ రహదారి 161పై కాంగ్రెస్ శ్రేణులు ధర్నా, రాస్తారోకో చేపట్టాయి. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని అడ్డుకుని అరెస్ట్ చేయడం ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న న్యాయమైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడంలో విఫలమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నినదించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై స్పష్టత వచ్చేంతవరకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ రాములు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌రెడ్డి, రవీందర్ చౌహాన్, నరేష్ బబ్లూ, అసెంబ్లీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ధర్మ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కిరణ్‌కుమార్ గౌడ్, రాఘవేందర్, సీడీసీ డైరెక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు సీనియర్ నాయకులు రాజు నాయక్, సంతోష్‌రెడ్డి, జహీర్ అరబ్బీ, రాంచంద్రారెడ్డి, అక్షయ్ జాడే, నవీద్, కుమ్మరి రాజు, రఘుపతి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అక్తర్ గోరి, ఇమామ్ పటేల్, నర్సింహారెడ్డి, సోమప్ప, సురేష్ తదితర యూత్ కాంగ్రెస్, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రాచలంలో హైటెక్ బస్టాండ్ కావాలి

**ప్రముఖ వ్యాపారి యిజ్జాడ రాంప్రసాద్ వినతి**



భద్రాచలం, అక్టోబర్ 08 : మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండి నిత్యం వేలాది మంది ప్రయాణీకులకు సేవలందిస్తున్న భద్రాచలం బస్టాండ్ ను హై-టెక్ బస్టాండ్ గా అభివృద్ధి చేయాలని ప్రముఖ వ్యాపారి యిజ్జాడ రాంప్రసాద్ కోరారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఆర్టీసీ డిపో మేనేజర్ కి గురువారం వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో తొలి విడతగా 13 పట్టణాలకు ఇప్పటికే హైటెక్ బస్టాండ్లు కేటాయించారని, అందులో షాపింగ్ కాంప్లెక్స్, ఎంటర్టైన్మెంట్ జోన్లు, వెయిటింగ్ లాంజ్, ప్రయాణీకులకు అధునాతన సౌకర్యాలు ఉంటాయని యిజ్జాడ రాంప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు కేటాయించడంతో అభివృద్ధి పనులు ఇటీవల మొదలు అయ్యాయని ఆయన గుర్తు చేసారు. రాబోయే గోదావరి పుష్కరాల కోసం ప్రయాణికులకు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి కొన్ని కోట్ల రూపాయలు ను ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో నిత్యం వేలాది భక్తులు ప్రయాణించే భద్రాచలం బస్టాండ్ ను ఆధునీకారించాల్సిన అవసరం ఉన్నదని ఆయన తెలిపారు. వీలైనంత త్వరలో మరిన్ని సౌకర్యాలు కల్పించి హై-టెక్ బస్టాండ్ గా మార్చాలని ఆయన కోరారు. భద్రాచలం లో హైటెక్ బస్టాండ్ అవసరం నీ వివరిస్తూ యిజ్జాడ రాంప్రసాద్ ఆర్టీసీ సీఈఓ కు వారం రోజుల క్రితం మెయిల్ పంపినట్లు తెలిపారు. అందుకు స్పందించిన ఆర్టీసీ సపోర్టింగ్ బృందం తనకు రిప్లై మెయిల్ ఇచ్చినట్లు చెప్పారు. అందులోని సూచన మేరకు స్థానిక డిపో మేనేజర్ కు తాను వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈ వినతి పత్రంలో హై-టెక్ బస్టాండ్ ఆవశ్యకతను వివరించి, యాత్రీకులకు కల్పించాల్సిన అధునాతన అవసరాలను, సౌకర్యాలను గురించి వివరించినట్లు తెలిపారు. అంతర్రాష్ట్రీయ సరిహద్దు బస్టాండ్ కావడంతో ఆంధ్ర, ఒడిస్సా, చత్తీస్ గడ్ రాష్ట్రాల ప్రయాణీకులు, భక్తులు అత్యధికంగా, నిత్యం ప్రయాణిస్తుంటారని ఆయన పేర్కొన్నారు. అత్యధిక ఆదాయం అందించే డిపో గా భద్రాచలం కు గుర్తింపు ఉన్నదని అన్నారు. "దక్షిణ అయోధ్య"గా భావించే భద్రాచలం లో హై టెక్ బస్టాండ్ అత్యంత అవసరమని స్థానిక విజయవాడ జ్యుయలరీ అధినేత, ప్రముఖ వ్యాపారి యిజ్జాడ రాంప్రసాద్ పేర్కొన్నారు.

## ఆక్వా ఎక్స్చేంజ్ ఫ్యాక్టరీను సందర్శించిన మహారాష్ట్ర మత్స్య శాఖ మంత్రి



కృష్ణాజిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ఆధునిక ఆక్వా సాగు విధానాల పరిశీలనా కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్ర మత్స్య శాఖ మంత్రి నితీష్ రాణే ఆక్వా ఎక్స్చేంజ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీను సందర్శించారు. ఈ క్రమంలో ఆక్వా రంగంలో ఐఓటీ పరికరాల అత్యాధునిక సాంకేతికత వినియోగంపై వివరాలు తెలుసుకొని,చెరువుల్లో నీటి నాణ్యత, ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయిల పర్యవేక్షణపై వివరాల గురించి,ఫీడ్ మానిటరింగ్, వాటర్ మోనిటరింగ్ పరికరాల పనితీరును పరిశీలించి,ఆటోమేషన్,ఇతర ఆధునిక పరికరాల వినియోగంపై ఫ్యాక్టరీ ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.,మహారాష్ట్ర మత్స్యశాఖ మంత్రిగా ఆయన ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తూ ఆక్వా పరిశ్రమలు నిర్వహించే వారిని కలుస్తున్నామని, ఈ పర్యటనలో భాగంగా ఈరోజు ఆక్వా ఎక్స్చేంజ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీని సందర్శించామని,రొయ్యల పెంపకాన్ని ఎలా బెటర్ గా చేయొచ్చో అర్థం చేసుకున్నామని తెలిపారు.రొయ్యల రైతుల లాభాలను పెంచడానికి వాళ్ళు తయారు చేసిన అనాలిసిస్, సాఫ్ట్ వేర్ నిజంగా అద్భుతంగా ఉందని,వాళ్ళు రైతులకు లాభాలు పెంచడంలో ఖచ్చితంగా సహాయం చేస్తున్నారని,ఇదే విధానాన్ని మహారాష్ట్రలో కూడా అమలు చేయడానికి ఇది మాకు స్ఫూర్తినిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వా ఎక్స్చేంజ్ యాజమాన్యం బి.కిరణ్, డి.హేమసుందర్, అరుణ్, ఫ్యాక్టరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ గురుపీఠంలోని భక్తుల పూజలు

శివ్వంపేట అక్టోబర్ 8 వాయిస్ టుడే : శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలో కొలువైన శ్రీ గురుపీఠం లో శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం గురుపరంపర దేవాలయం, పంచవటి, శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు జంట నగరాల నుంచి తరలివచ్చిన భక్తులు రెండు దేవాలయాల్లో కొలువైన మూలమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అభిషేకం అర్చన దివ్య మంగళ హారతి అనంతరం గంటలకు 11 గంటలకు శ్రీ దత్తాత్రేయ మహాస్వామి శతనామార్చన, శ్రీ దత్త స్తోత్రావళి ఫఠనం, శ్రీ దత్త భజనలు, శ్రీపాద వల్లభుల, శ్రీ నరసింహ సరస్వతి, శ్రీ గురుమాణిక్ ప్రభు, శ్రీ గురు స్వామి సమర్థ సహిత దత్తాత్రేయ స్వామి దివ్య మంగళ నీరాజనం ఇచ్చారు. తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సద్గురు సాయి మధ్యాహ్న హారతి తదనంతరం భక్తుల కోలహలం మధ్య శ్రీ సాయి సత్సంగ్ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన కాంతారావు, వారి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ప్రత్యేక పూజలను పరిష్కరించుకొని శ్రీ దత్తాత్రేయ మహా స్వామి పంచాయతనం, శ్రీ సాయిబాబాకు వివిధ పుష్ప మాలలతో సుందరంగా ముస్తాబు చేశారు. కాంతారావు కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పెద్దగాని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జిన్నారం సూర్యకుమార్ గౌడ్, న్యాయవాది జిన్నారం పెద్దగౌని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ జిన్నారం స్వరాజ్యలక్ష్మి, రాజ్యం భిక్షపతి యాదవ్, సర్పంచ్ లు బేగరి నర్సయ్య, న్యాయవాది వజ్జ సాయి కిరణ్, శెట్టిపల్లి భిక్షపతి, వారి కుమారులు, రాజేందర్ రెడ్డి, నాగేంద్ర, సమన్వయకర్త సత్యనారాయణ గౌడ్, అధిక సంఖ్యలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన ఏడీఏ వైద్యనాథ్‌కు ఘన సన్మానం

జహిరాబాద్ వాయిస్ టుడే అక్టోబర్ 08 ఝరాసంగం: జహీరాబాద్ నియోజకవర్గం నూతన వ్యవసాయ శాఖ ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వైద్యనాథ్‌నుఝరాసంగం మండల సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఝరాసంగం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో గినియార్పల్లి సర్పంచ్ కమ్మరి రాజేశ్వరి గోపాల్, బొప్పన్‌పల్లి సర్పంచ్ అమృత్ కలిసి ఏడీఏ డాక్టర్ వైద్యనాథ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్, జిర్లపల్లి నవాజ్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ రాయికోటి నర్సిములు, బాబు మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గన్నవరం సీఐ అహ్మాద్ అలీ చిత్రపటానికి నివాళులర్పించిన ప్రముఖులు, విలేకరులు

కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): గన్నవరం పోలీస్ స్టేషన్‌లో గతంలో సీఐగా విధులు నిర్వహించి అందరి ఆదరాభిమానాలు పొందిన దివంగత అహ్మాద్ అలీ పెద్దకర్మ కార్యక్రమం గోపన్నపాలెంలో అత్యంత వేడుకగా, సద్భావనా వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గన్నవరం నియోజకవర్గం నుండి పలువురు అధికారులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అహ్మాద్ అలీ గన్నవరంలో సీఐగా పనిచేసిన కాలంలో శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన చొరవ, ప్రజలతో మరియు విలేకరులతో కలిగి ఉన్న మైత్రి బంధాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గం నుండి మీడియా మిత్రులు కలపాల కరుణాకర్, మక్బూల్ బాషా, దావీదులతో పాటు గతంలో గన్నవరం సీఐగా సేవలు అందించిన వినయ్ మోహన్, కోమాగుల శివాజీ, అలాగే స్థానిక పోలీస్ స్టేషన్లలో పనిచేసిన పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

## పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**



సూర్యాపేట అక్టోబర్ 07 (వాయిస్ టుడే) : పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్లాంకెట్ హాల్‌లో తొమ్మిదో పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి కుటుంబంలో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి సకాలంలో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సిడిపిఓ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ అంబేద్కర్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద విద్యుత్ సమస్యలపై రైతుల రాస్తారోక ధర్నా



నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండలం దౌల్తాబాద్ అంబేద్కర్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద రైతులు విద్యుత్ సమస్యలపై ఆందోళన కు దిగారు భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా రైతులు పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘం రైతులు మాట్లాడుతూ ప్రస్తుత విద్యుత్ సరపరలు తరచూ అంతరాయాలు ఏర్పడడంతో పాటు ఓల్టేజ్ సమస్య కూడా తీవ్రంగా ఉంటుందని వారు ఆరోపించారు దీంతో బోరు మోటార్లు సైతం కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు మోటార్లు మరమ్మతులకు గురి కావడం కొత్త మోటార్లు ఏర్పాటు చేసుకోవాల్సి రావడంతో ఆర్థిక భారం పడుతుందని మరోవైపు వరి పొట్ట దశకు చేరుకున్న వారి పంటకు సకాలంలో నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేశామని వారు అన్నారు విద్యుత్తు సమయానికి అందకపోవడంతో పంటలు దెబ్బతింటే తమ పరిస్థితి ఏంటి అని వారు అన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ కొరత లేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో హత్నూర మండల పలు గ్రామాల భారతీయ కిసాన్ రైతులు పాల్గొన్నారు



## పెద్దమ్మ తల్లి ఆలయంలో పవిత్ర వృక్షాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవం

పాల్వంచ, అక్టోబర్ 8 వాయిస్ టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగన్నాథపురం శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ ఆవరణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేలకొరిగిన పవిత్ర రావి, వేప చెట్ల స్థానంలో నూతన వృక్షాలను పునఃప్రతిష్ఠించే మహోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ఏ.విజయ్ కుమార్, పునఃప్రతిష్ఠాపన దాత గిరీష్ ముక్తేవి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా భద్రాచలం భద్ర శ్రీ ఆరాధన పీఠం శ్రీమాన్ కోటి రామస్వరూప్ రాఘవాచార్యుల భక్త బృందం, అంగులూరి చిన్నారి, వారణాసి ధనలక్ష్మి ఆధ్వర్యంలోని వాసవి మహిళా సేవాదళ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామం, సౌందర్యలహరి పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, ఆలయ మాజీ ధర్మకర్త సంకా రాము, ధారా నరసింహారావు, ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పల వెంకటేశ్వర్లు, మహిళా సేవాదళ్ సభ్యులు అంగులూరి కల్పన, అంగులూరి చిన్నారి, వారణాసి ధనలక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 9 అక్టోబరు 2026



## డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

భద్రాచలం, అక్టోబర్ 08: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో బతుకమ్మ సంబరాలను గురువారం విద్యార్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జాన్ మిల్టన్ హాజరై బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని వివరించారు. తెలంగాణలో బతుకమ్మ గొప్ప పండుగని, స్ఫూర్తి కి ఐకమత్యానికి ఈ పండుగ ప్రత్యేకత అని,బతుకమ్మ పండుగ అంటే ప్రకృతిని ఆరాధించడం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు బతుకమ్మలను పేర్చి కోలాట నృత్యాలతో అలరించారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ వెల్లంకి రాఘసుమ, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీమతి హిమజ, అధ్యాపకులు శ్రీమతి హవీలా, కపిల భారతి, డాక్టర్ సమీర, శరణ్య, భవాని, కల్పన పావని, ఊర్వశి, శశికళ, పూర్ణిమ, కృష్ణవేణి, ఆఫీస్ సూపరిండెంట్ శ్రీమతి రేవతి తదితరులు పాల్గొన్నారు.



## జన విజ్ఞాన వేదిక ఆరవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి





కోదాడ, అక్టోబర్8 ( వాయిస్ టుడే ప్రతినిధి ) హైదరాబాదులోని మాదాపూర్ లో10,11 వ తేదీలలో జరుగుతున్న జనవిజ్ఞాన వేదిక ఆరవ మహాసభలను జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కలకుంట్ల సైదులు, ప్రధాన కార్యదర్శి షేక్ జాఫర్, కోశాధికారి డాక్టర్ పులిపాటి క్రాంతి కుమార్ తెలిపారు. ఈ యొక్క మహాసభలో ప్రొఫెసర్ డాక్టర్స్ మరియు సైన్స్ పెద్దలు పాల్గొంటారని రాబోవు తరాలకు సైన్స్ యొక్క అభివృద్ధి ఎంత దోహదపడుతుందో వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు తల్లాడ రామచంద్రయ్య, మాజీ జిల్లా అధ్యక్షులు గోల్లమూడి రమేష్ బాబు ఉపాధ్యక్షులు దేవరశెట్టి నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రికి రూ.15 లక్షల కంప్యూటర్లు




శ్రీకాళహస్తి(వాయిస్ టుడే) అక్టోబర్ 08 శ్రీకాళహస్తి: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి స్థానిక కోకాకోలా పరిశ్రమ యాజమాన్యం రూ.15 లక్షల విలువైన 15 కంప్యూటర్ సిస్టమ్‌లను అందజేసింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి శుక్రవారం వాటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.పేదలకు మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ సేవలను బలోపేతం చేసేందుకు కంప్యూటర్లు అందించిన కోకాకోలా పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రూ.72 లక్షల ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగం

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.72 లక్షల ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంపై విజయవాడకు చెందిన ప్రత్యేక ఆడిట్ కమిటీ విచారణ పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. గత ఆగస్టు 28న ఆసుపత్రికి వచ్చిన ఆడిట్ బృందం రికార్డులను పరిశీలించిందన్నారు. ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన లక్ష్మీ ప్రసన్న నిధులను దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. దుర్వినియోగమైన మొత్తంలో ఇప్పటికే రూ.22 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.50 లక్షల రికవరీ కోసం శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదై దర్యాప్తు కొనసాగుతోందన్నారు ఈ వ్యవహారంతో ఆసుపత్రి వైద్యులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యంపై అసత్య ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# కష్టాలు ఎన్ని ఉన్నా.. పేద ప్రజల ముఖాల్లో చిరునవ్వే నా లక్ష్యం



సూర్యాపేట జిల్లా వాయిస్ టుడే,లి అక్టోబర్ 09: జీవితంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజాసేవ పట్ల తన సంకల్పం ఏమాత్రం తగ్గదని స్వయంకృషి ప్రతిభ ఫౌండేషన్ చైర్మన్ సాగర్ల అశోక్ యాదవ్ తెలిపారు. పేద ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తన జీవిత లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అవసరంలో ఉన్నవారికి చేయూత అందించడం, రైతుల సమస్యలపై తన వంతు స్పందించడం, విద్యార్థులను ప్రోత్సహించడం, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేదలకు సాధ్యమైన సహాయం అందించడం, ప్రతిభ ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల కోసం స్వయంకృషి ప్రతిభ ఫౌండేషన్ ద్వారా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

"నా జీవితంలో ఎన్ని కష్టాలు ఉన్నా.. ఒక పేద కుటుంబం ముఖంలో చిరునవ్వు చూడగలిగితే అదే నాకు నిజమైన సంతృప్తి. డబ్బు ఉండటం కంటే సేవ చేయాలనే సంకల్పం ఉండటం ముఖ్యం. నా శక్తి మేరకు ప్రజలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమంలో ముందుండాలని కోరుకుంటున్నాను" అని అశోక్ యాదవ్ అన్నారు.

రైతులు దేశానికి వెన్నెముకలాంటి వారని, వ్యవసాయ రంగంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు సాధ్యమైనంత వరకు అండగా నిలవాలని తనకు ఉందని ఆయన తెలిపారు. రైతులకు సంబంధించిన సమస్యలు, అత్యవసర పరిస్థితులు, పేద కుటుంబాల ఇబ్బందులు, విద్యా మరియు వైద్య అవసరాలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, విద్యా అవసరాలు, వ్యవసాయ సమస్యలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులతో బాధపడుతున్న వారు స్వయంకృషి ప్రతిభ ఫౌండేషన్‌ను సంప్రదించాలని అశోక్ యాదవ్ సూచించారు. సమస్య యొక్క తీవ్రత, పరిస్థితిని బట్టి ఫౌండేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

"ఎవరూ తమ సమస్యతో ఒంటరిగా బాధపడకూడదు. సమస్య చిన్నదైనా.. పెద్దదైనా.. మా దృష్టికి తీసుకురండి. మా శక్తి మేరకు మీకు అండగా నిలబడేందుకు ప్రయత్నిస్తాం. రైతు, కూలీ, పేద కుటుంబం, విద్యార్థి.. ఎవరికైనా అవసరమైన సమయంలో మానవతా దృక్పథంతో స్పందించడమే మా లక్ష్యం" అని అయన పేర్కొన్నారు.

"పదవి కోసం కాదు.. ప్రచారం కోసం కాదు..
ప్రజల ముఖాల్లో చిరునవ్వు కోసం నా ప్రయత్నం.
ఆపదలో అండగా..
అవసరంలో చేయూతగా..
రైతుకు భరోసాగా..
ప్రతిభకు ప్రోత్సాహంగా..
ప్రతిభని గుర్తిస్తాం.. భవిష్యత్తుని నిర్మిస్తాం" అని స్వయంకృషి ప్రతిభ ఫౌండేషన్ చైర్మన్ సాగర్ల అశోక్ యాదవ్ తెలిపారు.

సహాయం లేదా సమస్యను తెలియజేయడానికి:

**స్వయంకృషి ప్రతిభ ఫౌండేషన్, సంప్రదించండి: 091 6281972584**

## విలక్షణ నటుడు.. మానవతా మూర్తి నానా పటేకర్ : బి. వెంకట్



భద్రాచలం, అక్టోబర్ 08: ప్రముఖ సినీ నటుడు, సామాజిక సేవకుడు నానా పటేకర్ ఆకస్మిక మరణం పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. వారి రైతు , కార్మిక ఆకాంక్షల అమలు కు కృషి చెయ్యటమే నిజమైన నివాళి అని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తన సంతాపంలో తెలిపారు. నానా పటేకర్ గొప్ప నటుడిగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారని ఆయన అన్నారు. నానాపటేకర్ కేవలం సినీ కళాకారుడిగానే కాకుండా రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల సమస్యల పట్ల సున్నితంగా స్పందించిన ప్రజా వ్యక్తిగా కూడా చిరస్మరణీయులుగా నిలిచిపోతారని బి వెంకట అన్నారు. మహారాష్ట్రలో కరువు, రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలు నానా పటేకర్‌ను తీవ్రంగా అలిచి వేశాయని తెలిపారు. రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వారి సమస్యలపై బహిరంగంగా మాట్లాడటమే కరువు ప్రభావిత గ్రామాల్లో నీటి సంరక్షణ, గ్రామీణాభివృద్ధి, రైతు కుటుంబాలకు సహాయం చేసిన గొప్ప వ్యక్తి నానా పటేకర్ అని అన్నారు. రైతు పండించిన పంటకు సరైన ధర లభించాల్సిన అవసరాన్ని నానా పటేకర్ పదేపదే ప్రస్తావించే వారిని తెలిపారు. బంగారం ధర పెరుగుతున్నప్పుడు ధాన్యం ధర ఎందుకు పెరగదు? అని ప్రశ్నించడం ద్వారా నానాపటేకర్ రైతుల పరిస్థితిని ప్రజల ముందు ఉంచారని వెంకట్ పేర్కొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు పంటలకు న్యాయమైన ధర కల్పించాలని ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు. రైతుల సమస్యలకు కేవలం తాత్కాలిక ఉపశమన చర్యలు కాకుండా, వ్యవసాయానికి స్థిరమైన ఆదాయం కల్పించే విధానాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నానా పటేకర్ రాజకీయ నాయకుడు కాదు. అయినప్పటికీ రైతుల సమస్యలపై మాట్లాడేటప్పుడు ఆయన ఎలాంటి మొహమాటం చూపించలేదు. "మంచి రోజులు వస్తాయని ఎదురుచూడకండి; మంచి రోజులను తీసుకురావడానికి ప్రయత్నించండి. ఎలాంటి ప్రభుత్వం రావాలో మీరే నిర్ణయించండి" అని రైతులకు ఆయన ఇచ్చిన పిలుపు, రైతుల సమస్యలపై ఆయనకున్న ఆవేదనను తెలియజేస్తుంది. రైతు దేశానికి అన్నం పెడుతున్నాడు. వ్యవసాయ కార్మికుడు తన శ్రమతో ఆ వ్యవసాయ ఉత్పత్తి ప్రక్రియను నడిపిస్తున్నాడు. ఈ ఇద్దరి శ్రమపైనే గ్రామీణ భారత ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. అందువల్ల నానా పటేకర్ గారి రైతు, గ్రామీణ ప్రజల పట్ల ఉన్న ఆకాంక్షలను గౌరవించడం అంటే కేవలం ఆయనకు నివాళులు అర్పించడం మాత్రమే కాదనీ, రైతు భూమిని, రైతు హక్కులను, వ్యవసాయాన్ని కార్పొరేట్ ఆధిపత్యం నుంచి కాపాడటమే ముఖ్యమని వెంకట్ అన్నారు. .

## బతుకమ్మ, నవరాత్రి, దసరా పండుగలకు 34 ప్రత్యేక రైళ్లు

**సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ మధ్య ప్రత్యేక సర్వీసులు: దక్షిణ మధ్య రైల్వే అధికారులు**

కాజీపేట, అక్టోబరు 08 (వాయిస్ టుడే): బతుకమ్మ, నవరాత్రి, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ మధ్య 34 డైలీ ఫెస్టివల్ స్పెషల్ రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు అక్టోబరు 9 నుంచి 25వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్ (07711) ప్రత్యేక రైలు మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ చేరుకుంటుంది. సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ (07712) రైలు సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఒక్కో రైలు 17 సర్వీసుల చొప్పున నడుస్తాయి. ఈ ప్రత్యేక రైళ్లు రెండు దిశల్లో చర్లపల్లి, భువనగిరి, జనగామ, కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ రోడ్ స్టేషన్లలో ఆగుతాయి. రైళ్లలో ఏసీ చైర్ కార్, సెకండ్ సిట్టింగ్ తరగతుల కోచ్‌లు ఉంటాయని రైల్వే అధికారులు తెలియజేశారు.

## కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

**ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



శివ్వంపేట అక్టోబర్ 8 వాయిస్ టుడే : పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం శివ్వంపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని పరిపాలనా వ్యవహారాలు, రికార్డుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ తీరును పరిశీలించారు. క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, కేసు డైరీలు, ముద్దాయిల రిమాండ్ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న యూఐ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లు, సీసీ నంబర్లు రాని కేసుల వివరాలను ఎస్సై మధుకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన దర్యాప్తు చేపట్టి కేసుల ఫైళ్లను త్వరితగతిన కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. ఈ ఏడాది మూడు కేసుల్లో జీవిత ఖైదు పడేలా తీర్పులు రావడంలో కృషి చేసిన ఎస్సై మధుకర్ రెడ్డి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రధాన కూడళ్లు, గ్రామాలలో పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, సీసీటీవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, అక్రమ మద్యం, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, ఆన్‌లైన్ మోసాలకు గురైన వారు వెంటనే 1930కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ వెంకటరాజు గౌడ్, ఎస్‌బీ సీఐ సందీప్ రెడ్డి, ఎస్సై మధుకర్ రెడ్డి, ఏఎస్ఐ భారతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూసేకరణ వేగవంతం చేయాలి

**అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి**

**కుడా చైర్మన్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 8 (వాయిస్ టుడే):లి వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, కుడా వైస్ చైర్‌పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. గురువారం నాయుడు పెట్రోల్ పంప్ జంక్షన్ నుంచి తూర్పుకోట, జాన్ పీరీల గేట్ తదితర ప్రాంతాల్లో ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను కుడా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తూర్పుకోట వద్ద అభివృద్ధి చేయనున్న మోటు ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ, తదుపరి అభివృద్ధి పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, తూర్పుకోట వద్ద మోటు అభివృద్ధికి అవసరమైన భూసేకరణను కూడా పూర్తి చేసి పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, కుడా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఏపీవో శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు శ్రీదేవి దీక్షకు ముగింపు

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవతో శ్రీకాంత్ - శ్రీదేవి వివాహం**

**ఫలించిన శ్రీదేవి పోరాటం**



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 08(వాయిస్ టుడే):లి ప్రియుడు శ్రీకాంత్‌తో వివాహం జరిపించాలని కోరుతూ నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న శ్రీదేవి ఆందోళనకు ముగింపు లభించింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు చొరవతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇరువర్గాల కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించడంతో శ్రీదేవి దీక్ష విరమించారు. అనంతరం శ్రీకాంత్--శ్రీదేవి పరస్పరం వివాహ దండలు మార్చుకున్నారు. నూతన దంపతులు అనంతరం ఎమ్మెల్యే నాగరాజు నివాసానికి వెళ్లగా, ఎమ్మెల్యే నాగరాజు, ఆయన సతీమణి మల్లీశ్వరి నూతన వధూవరులకు పెళ్లి వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు.

**ప్రేమ వివాహం చేసుకున్న ఎమ్మెల్యే.. ప్రేమజంటకు అండగా**

తాను కూడా ప్రేమ వివాహం చేసుకున్న నేపథ్యంలో ప్రేమ, వివాహం విషయంలో యువత ఎదుర్కొనే ఇబ్బందులను అర్థం చేసుకుని ఈ జంటకు అండగా నిలిచినట్లు ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. కుటుంబాల మధ్య అపార్థాలను చర్చల ద్వారా పరిష్కరించి యువజంట భవిష్యత్తుకు అండగా నిలవాలని ఆయన సూచించినట్లు తెలిపారు. ఎట్టకేలకు శ్రీదేవి చేసిన నాలుగురోజుల మౌన పోరాటానికి శుభం కార్డు పడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాముగౌడ్, సీనియర్ నాయకులు బుద్దే పెద్దన్న, వర్ధన్నపేట మండల యూత్ అధ్యక్షుడు భాను ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**